క్లుప్తంగా

కుమార్‌రాజాకు జెడ్పీ చైర్మన్ అభినందన



కుమార్‌రాజాను అభినందిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

బంగారుపాళెం: రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన కుమార్‌రాజాను సోమవారం జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు అభినందించారు. ఆయన స్వగృహంలో కలసి శాలువ కప్పి పూలమాలతో సన్మానించారు. మండలంలోని పలువురు పాలఏకరి కులస్తులు, అభిమానులు కుమార్‌రాజాను కలసి అభినందించారు.

21న ఇంటర్నేషనల్ యోగా దినోత్సవం

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని గిరింపేట మున్సిపల్ హైస్కూల్లో ఈ నెల 21న ఇంటర్నేషనల్ యోగా దినోత్సవం నిర్వహించనున్నట్లు ఎస్ఎస్‌వై యోగాచార్యులు నరేంద్ర పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు నిర్వహించే కార్యక్రమంలో యోగా ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించనున్నట్లు ఆయన వెల్లడించారు.

రెవెన్యూ సదస్సుకు హాజరుకండి

యాదమరి: పూతలపట్టు మండలం ఎంపీడీఓ కార్యాలయంలో రెవెన్యూ సదస్సును ఈ నెల 21న నిర్వహించనున్నట్లు తహసీల్దార్ హనుమంతు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కలెక్టర్ సగిలి షణ్మోహన్ జిల్లాలో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పూతలపట్టు ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. యాదమరి మండలంలోని రెవెన్యూ కార్యాలయ అధికారులందరూ హాజరు కావాలని కోరారు.

తవణంపల్లె: పూతలపట్టులో బుధవారం నిర్వహించే నియోజకవర్గ స్థాయి రెవెన్యూ సదస్సుకు అధికారులంతా హాజరుకావాలని తహసీల్దార్ గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ భూ సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు.

కరెంటు చార్జీలు తగ్గించాలి

చిత్తూరు కార్పొరేషన్: కరెంటు చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ డిమాండ్ చేశారు. చిత్తూరులో సోమవారం ఆ పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సర్వీసులపై వేసే ట్రూఅప్, ఇతర చార్జీల భారం తీసివేయాలన్నారు. ఏదో ఒక బిల్లుల రూపంలో ప్రజలపై వడ్డన వేయరాదని వివరించారు. కార్యక్రమంలో నాయకులు గోపినాథ్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కిట్లు పూర్తి స్థాయిలో అందజేయాలి

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న విద్యాకానుక కిట్లను పూర్తి స్థాయిలో అందజేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి అన్నారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పాఠ్య పుస్తకాలకు రూ.1200 చెల్లించాలని ఇంటర్మీడియట్ బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ప్రవీణ్‌కుమార్, జిల్లా నాయకులు హేమంత్, తిమ్మన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చిరుజల్లులతో ఉపశమనం

చిత్తూరు రూరల్: నైరుతి రుతుపవనాల ప్రభావంతో వాతావరణం చల్లగా మారింది. ఉదయం నుంచే కమ్ముకున్న మేఘాలు చిరుజల్లులతో వేసవి తాపాన్ని తరిమేశాయి. ఒకసారి బలమైన వర్షం కురిసి, ఆ తర్వాత కురిసిన జల్లులు సాయంత్రం వరకూ చల్లదనాన్ని అందించాయి. ఈ వర్షానికి వేరుశనగ విత్తే రైతులు దుక్కులు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

గుడిపాల ఎంఈఓ-2గా గణపతి



నియామక ఉత్తర్వులు అందజేస్తున్న గణపతి

గుడిపాల: మండల విద్యాశాఖాధికారి-2గా గణపతి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎస్ఆర్‌పురం మండలం కొత్తపల్లె మిట్ట జెడ్పీ హైస్కూల్ హెచ్ఎంగా ఉన్న గణపతికి పదోన్నతిపై ఎంఈఓ-2గా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు ఆయన ఎంఈఓ రామ్ నాయక్‌కు జాయినింగ్ లెటర్ అందజేసి బాధ్యతలు స్వీకరించారు.

ఇంటింటా నవరత్న వెలుగులు

- జడివానలో తడుస్తూ.. ఊరంతా తిరుగుతూ..
- ప్రభుత్వ పథకాల అమలు, ప్రజా సమస్యలపై ఆరా
- పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు



లబ్ధిదారులకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



మీడియాతో మాట్లాడుతున్న ఎంఎస్ బాబు

తవణంపల్లె: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తోందని, నవరత్నాలతో ప్రతి ఇంటా వెలుగులు నిండాయని పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన తవణంపల్లె సచివాలయం పరిధిలో ఆయన సోమవారం పర్యటించారు. తవణంపల్లె, జోగివారిపల్లె, రామకృష్ణాపురం, తవణంపల్లె పేట, జర్నలిస్టు కాలనీ, దుర్యోధన కాలనీ, దాసరపాళ్యంలో ఇంటింటికీ తిరిగారు. జడవానలో తడుస్తూనే ప్రభుత్వ పథకాల అమలు తీరును తెలుసుకున్నారు. ప్రజాసమస్యలను అడిగి తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి జగనన్నను గెలిపించి మరో సారి సీఎం చేస్తామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే బాబు మాట్లాడుతూ జగనన్న ప్రజల్లో గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని చెప్పారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గాలికి కొట్టుకుపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. వచ్చే ఎన్నికల్లో అధికారం చేపట్టిన తర్వాత జగనన్న నవరత్నాలను మించి అభివృద్ధి చేస్తారని స్పష్టం చేశారు. రేషన్‌కార్డులు, ఇంటి పట్టాలు, పక్కాగృహాలు, పైపులైన్లు వేసి తాగునీరు సరఫరా చేయాలని, సిమెంటు రోడ్లు నిర్మించాలని, టి.పుత్తూరు రోడ్డు నుంచి రామకృష్ణాపురం వరకు రోడ్డు బాగు చేయాలని పలు సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికితీసుకొచ్చారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ వెంటనే సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్దుల్‌కలామ్‌ఆజాద్, తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి, ఎంఈఓ శంకరయ్య, వ్యవసాయాధికారి ప్రవీణ్, భూరీసర్వే డీటీ వెంకటరమణ, ఏపీఎం రవి, ఏపీఓ లలిత, ఇంజనీర్లు గురువారెడ్డి, ఈశ్వర్, కిరణ్, శ్రీధర్, మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలు తీసుకుంటారు..విమర్శిస్తారు

యాదమరి : టీడీపీ నాయకులు పథకాలు తీసుకుంటున్నారు.... ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు, ఇదెక్కడి న్యాయం అని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ప్రశ్నించారు. తవణంపల్లె మండలంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం అనంతరం జోగివారిపల్లెలో విలేకర్లతో మాట్లాడారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో అక్క చెల్లెమ్మలు, గ్రామీణ ప్రజలు అందరు జగనన్న అందిస్తున్న పథకాలతో సంతోషంగా ఉన్నామని చెబుతున్నారని ఆయన గుర్తుచేశారు. జగనన్నే మరో సారి ముఖ్యమంత్రి కావాలని ప్రజలందరూ కోరుకుంటున్నారని తెలిపారు. జగనన్న ముఖ్యమంత్రి అయిన వెంటనే రాష్ట్రంలో కులమత బేధాలు, పార్టీలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలను, నవరత్నాల ద్వారా అందిస్తున్నారని చెప్పారు. కరోనా సమయంలోనూ ప్రభుత్వ పథకాలు ఆపలేదని గుర్తుచేశారు. కానీ కొంతమంది టీడీపీ నాయకులు ప్రభుత్వ పథకాలన్నీ తీసుకొని వైఎస్సార్‌సీపీని, జగనన్నను విమర్శించడం దారుణమన్నారు. చంద్రబాబు ఎన్నికల కోసం గాలి మాటలు చెబుతూ ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కానీ గ్రామాల్లోఉన్న ప్రజలు, అక్క చెల్లెమ్మలు ఎవరూ నమ్మడం లేదని తెలిపారు. మరోపక్క దత్తపుత్రుడు ఏమి మాట్లాడుతున్నాడో అయనకే అర్థం కావడం లేదని విమర్శించారు.

దరఖాస్తుల ఆహ్వానం

బంగారుపాళెం: మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల(బాలురు)లో చేరేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ వెంకటసుబ్బయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరానికి ఎస్టీ బాలురు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మూడో తరగతిలో-40, నాలుగో తరగతిలో-34, ఐదో తరగతిలో-34, ఆరవ తరగతిలో-20, ఏడో తరగతిలో-20, ఎనిమిదో తరగతిలో-21, తొమ్మిదో తరగతిలో-20 ఖాళీలు ఉన్నాయన్నారు. 3వ తరగతిలో ఎస్టీలకు-32, ఎస్సీలకు-05, బీసీలకు-02, ఓసీలకు - ఒక్కటి రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయించినట్లు వివరించారు. 4వ తరగతి నుంచి 9వ తరగతి వరకు బ్యాక్‌లాగ్ ఖాళీలను ఎస్టీ విద్యార్థులతో భర్తీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని గిరిజన బాలురు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ కోరారు.

దిశ యాప్‌తో రక్షణ

గుడిపాల: ఆపదలో ఉన్న మహిళలను రక్షించేందుకు రూపొందించిన దిశ యాప్ ప్రతి ఒక్కరి సెల్‌ఫోన్‌లో ఉండేలా చూసుకోవాలని ఎస్ఐ రాజశేఖర్ అన్నారు. నరహరిపేటలో సోమవారం దిశయాప్‌పై అవగాహన కల్పించి డౌన్‌లోడ్ చేయించారు. ఆయన మాట్లాడుతూ దాడులు, అత్యాచారాలు, నేరాల నుంచి సెల్‌ఫోన్‌లో ఒక్క బటన్ నొక్కడం ద్వారా మహిళలు రక్షణ పొందవచ్చని వివరించారు. ఆపదలో ఉన్న వారు, ఎవరైనా యాప్‌ను ఉపయోగించుకోవచ్చన్నారు.

యాదమరి తహసీల్దార్‌గా హనుమంతు



యాదమరి: మండల తహసీల్దార్‌గా హనుమంతు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ స్థానంలో ఉన్న చిట్టిబాబు బదిలీపై వీ.కోటకు వెళ్లగా ఆయన స్థానంలో పెద్దపంజాణి నుంచి బదిలీపై యాదమరి తహసీల్దార్‌గా విచ్చేసి ఉదయం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన కార్యాలయ సిబ్బందికి సమావేశం ఏర్పాటు చేశారు. సమస్యలతో వచ్చే రైతులకు ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలు పరిష్కరించాలన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులున్నా నేరుగా చెప్పవచ్చని దళారులను ఆశ్రయించరాదన్నారు. వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సర్వేయర్లు ఎక్కడైనా రైతులను ఇబ్బందులకు గురి చేసినట్లు తెలిస్తే వెంటనే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

నేడు వాహనాల వేలంపాట

చిత్తూరు అర్బన్: నగరంలోని అర్బన్ ఎస్ఈబీ కార్యాలయంలో మంగళవారం వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలంపాట నిర్వహించనున్నట్లు ఎస్ఈబీ సీఐ జోగేంద్ర తెలిపారు. ఉదయం 10 గంటలకు వేలంపాట ప్రారంభమవుతుందన్నారు. ఆసక్తి గలవారు ముందుగా రూ.5వేలు డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

పూతలపట్టు: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ వారు మండల ప్రజలకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు చెన్నై శంకర నేత్రాలయ సిబ్బంది ఓ ప్రకటనలో తెలిపారు. కంటి పొర, దూరపుచూపు, మెల్లకన్ను వంటి వాటిని వైద్యులు గుర్తించి ఉచిత చికిత్స చేస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 98850 93346, 89196 90152ను సంప్రదించగలరు.

వేడుకగా అర్జున తపస్సు



అర్జున్ తపస్మాన్ వద్ద వరపడిన మహిళలు

యాదమరి: మండలంలోని చెన్నారెడ్డి పల్లెలో వెలసిన ద్రౌపతి ధర్మరాజుల ఆలయం వద్ద అర్జున తపస్సు వేడుకగా నిర్వహించారు. సంతానం కోసం మహిళలు కోనేటిలో మునిగి తడిబట్టలతో తపస్మాను వద్ద వరపడ్డారు. వేకువజామున ఆలయంలో వెలసిన ద్రౌపతి ధర్మరాజులకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, అలంకరణలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం పాండవుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేసి తపస్మాను వద్ద కొలువు దీర్చారు. అర్జున వేషధారి తప్పస్మానులోని మెట్టు మెట్టుకు కీర్తనలు ఆలపిస్తూ అధిరోహించారు. మహిళలు సంతానప్రాప్తి కోసం తడిబట్టలతో తపస్మాను చుటూవరపడ్డారు. అర్జున వేషధారి వెంట తీసుకెళ్లిన వీభూది పండ్లు, బొరుగులు, నిమ్మకాయలను భక్తుల మీదకు చల్లారు.

అట్టహాసంగా రాత్రి నాటకాలు

చెన్నారెడ్డిపల్లెలోని ద్రౌపతి ధర్మరాజుల ఆలయం వద్ద నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో రాత్రి నాటకాలు అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. రాత్రి ద్రౌపదీ వస్త్రాభరణం నాటికను వేషధారులు కనులవిందుగా నిర్వహించారు.

ప్రమాదకరంగా గ్రానైట్ వ్యర్థాల రవాణా



జాగ్రత్తలు పాటించకుండా వెళ్తున్న గ్రానైట్ వ్యర్థాలు

గుడిపాల: చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై ట్రాక్టర్లలో గ్రానైట్ వ్యర్థాలను రోడ్డుపై ఇలా ప్రమాదకరంగా రవాణా చేస్తుంటారు. మండలంలో గ్రానైట్ ఫ్యాక్టరీలు అధికంగా ఉన్నాయి. ఫ్యాక్టరీ వారు ట్రాక్టర్ల ద్వారా గ్రానైట్ వ్యర్థాలను రోడ్డు పక్కలో పడవేస్తున్నారు. రవాణా చేసే సమయంలోనూ ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదు. ఇలాంటి వాహనాలు చిన్న ప్రమాదానికి గురైనా అధికనష్టం జరిగే అవకాశం ఉంది. ఇకనైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

స్పందనకు ఆరు వినతులు

చిత్తూరు అర్బన్: నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ×స్పందన్ష కార్యక్రమంలో ఆరు వినతులు అందినట్లు నగర కమిషనర్ అరుణ తెలిపారు. నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో కమిషనర్ నగర ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో భాగంగా గతవారం అందిన వినతుల పరిష్కారంపై శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వినతులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, పరిష్కరించిన అనంతరం సరైన రికార్డులతో మరోసారి ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. స్పందన కార్యక్రమంలో ఇంజనీరింగ్ -3, టౌన్ ప్లానింగ్-2, ప్రజారోగ్యం -1 చొప్పున మొత్తం ఆరు వినతులు అందినట్లు చెప్పారు. అనంతరం జగనన్న సురక్ష, జగనన్నకు చెబుదాం, హౌసింగ్ కార్యక్రమాలపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంహెచ్వో లోకేష్, ఎంఈ వెంకట ప్రసాద్, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, హౌసింగ్ ఏఈ శ్రీధర్, సీఎంఎం గోపి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలను వెంటనే పరిష్కరించాలి

తవణంపల్లె: స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో, ఎంపీడీఓ అబ్దుల్‌కలామ్ ఆజాద్, తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి, వ్యవసాయాధికారి ప్రవీణ్, ఎంఈఓ శంకరయ్య, భూరీసర్వే డీటీ వెంకటరమణ, ఏపీఎం రవితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. జగనన్న లేఔట్లలో గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, 22ఏ అమలు చేయాలని జాయింట్ కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

జాబ్‌కార్డులను సద్వినియోగం చేసుకోండి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ జాబ్‌కార్డు కలిగిన ప్రతిఒక్కరూ ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గౌరి అన్నారు. ఆమె సోమవారం మండలంలోని యం.బండపల్లి గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలో జాబ్‌కార్డులు, ఉపాధి పనులను ఎంత మంది ఉపయోగించుకుంటున్నారని ఆరాతీశారు. గ్రామస్తులతో మాట్లాడుతూ ఉపాధి కోసం ఎవరూ వలస పోకూడదని తెలిపారు. ప్రభుత్వం ఆయ గ్రామాల్లోనే ఉపాధి పనులను కల్పిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సౌభాగ్యవతి, పంచాయతీ కార్యదర్శి హేమలత పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి

చిత్తూరు రూరల్: రైతులు సాధారణ వ్యవసాయ పద్ధతుల్లోనే చిన్న చిన్న మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన కో-ఆర్డినేటర్ శారదా జయలక్ష్మి అన్నారు. చిత్తూరు మండలం తుమ్మింద రైతు భరోసా కేంద్రంలో సోమవారం మన గ్రోమోర్ వారి సమన్వయంతో వివిధ రకాల పంటసాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులకు వేరుశెనగ విత్తన శుద్ధి, జిప్సమ్ వాడకం, తక్కువ పెట్టుబడితో పురుగుమందు వినియోగం, వరిలో మేలైన యజమాన్య పద్ధతులు, సమయానికి అనుగుణంగా కలుపు మందులు వాడకం, ఎరువుల వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త కే.రాఘవేంద్ర మాట్లాడుతూ మామిడి సాగులో అవలంభించవలసిన కొమ్మ కత్తిరింపులు, లింగాకర్షక బుట్టల ప్రయోగం, కవర్ల వినియోగం, నీటి యాజమాన్యం, బొప్పాయిలో వివిధ రోగాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో చిత్తూరు వైస్ ఎంపీపీ రజని, మనగ్రోమోర్ ఏరియా మేనేజర్ మహమ్మద్, తుమ్మింద గ్రామ వ్యవసాయ సహాయకుడు మోహన్, రైతులు పాల్గొన్నారు

నేడు ఉత్తరబ్రాహ్మణపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం

తవణంపల్లె: మండలంలోని ఉత్తరబ్రాహ్మణపల్లె పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో మంగళవారం ఉదయం 6.30 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని తవణంపల్లె ఎంపీపీ గీతారెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్‌కలామ్ ఆజాద్ తెలిపారు.పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి పర్యటిస్తారని వివరించారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు తప్పక హాజరుకావాలని కోరారు.

శతాబ్దపు మైలురాయి 'రీ సర్వే'



సాక్షితో తహసీల్దార్ కిరణ్

చిత్తూరు రూరల్: మండలంలో జగనన్నశాశ్వత భూ హక్కు, భూరక్ష పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రీసర్వేను చేపడుతోంది. తొలుత పైలెట్ ప్రాజెక్టు కింద కొన్ని గ్రామాల్లో రీసర్వేను చేపట్టారు. తర్వాత విడతల వారీగా మిగిలిన గ్రామాల్లో కూడా రీసర్వేను అమలు చేస్తున్నారు. ఏళ్ల తరబడి నెలకొన్న భూసమస్యలు పరిష్కారానికి నోచుకునేలా అధికారులు తనవంతు ప్రయత్నం చేస్తున్నారు. దీనిపై తహసీల్దార్ కిరణ్ 'సాక్షి'తో మాట్లాడుతూ ఈ రీ సర్వేను శతాబ్దపు మైలురాయిగా అభివర్ణించారు.

ఆయన ఇంకా ఏం చెప్పారంటే..

- వందేళ్ల తరువాత భూ రీసర్వేను తీసుకొచ్చారు. ఈ రీసర్వే ముఖ్య ఉద్దేశం ఏళ్ల తరబడి ఉన్న భూ సమస్యలను పరిష్కరించడం. భూములకు సంబంధించి సరైన పత్రాలు లేకుంటే వాటి అనుభవ పూర్వపరాలను పరిశీలించి సర్వహక్కులు కల్పించడం. గ్రామ సర్వేయర్లు, వీఆర్‌ఓ, వీఆర్‌ఏలు, మండల సర్వేయర్, డీటీ పర్యవేక్షణలో ఈ సర్వే చేస్తున్నాం.
- పైలెట్ ప్రాజెక్టు కింద తొలుత పెరుమాళ్ల కండ్రిగ గ్రామ రెవెన్యూలో రీసర్వే చేసి పూర్తిచేశాం. అక్కడ సర్వే రాళ్ల నాటే కార్యక్రమం పూర్తి కావచ్చింది. రెండో విడతగా వరదరాజులపల్లి, కుర్చివేడులో కూడా రీసర్వే పూర్తయింది. తరువాత అలుకూరుపల్లి, క్రిష్ణాపురం, 33 వెంకటాపురం, 36 గొల్లపల్లి, ఐనవేడు, ముత్తుకూరు, పచ్చన్నపల్లి, గువ్వకల్లు, చింతలగుంట, అరతల గ్రామాల్లో కొనసాగుతోంది. అక్కడ కూడా త్వరలో పూర్తి చేస్తాం.
- రీసర్వేలో అన్ని చోట్ల సమస్యలు వస్తున్నాయి. ఇది రెవెన్యూశాఖకు మామూలే. ఎక్కువగా సర్వే నంబర్లు తారుమారు కావడం. విస్తీర్ణంలో తేడాలు, భాగపరిష్కారాలు వంటి కేసులు చాలా ఉన్నాయి. వాటిని రీసర్వే బృందం చాకచక్యంగా పరిష్కరిస్తూ వస్తోంది. ఇలాంటి కేసులు పెరుమాళ్లకండ్రిగలో 20వరకూ పరిష్కరించాం.
- ముందుగానే గ్రామాల్లో గ్రామసభ పెట్టి రీసర్వే ఉద్దేశాన్ని వివరిస్తున్నాం. చాలా మంది భూహక్కుదారులు దీనికి సహకరిస్తున్నారు. సహకరించారు కూడా. రీసర్వే పూర్తయిన తరువాత వచ్చిన సమస్యలను ఇరు భూస్వాములును పిలిపించి వీలైనంత వరకు సర్దుబాటు చేస్తున్నాం. కోర్టు కేసులు ఉన్నవాటిని కూడా పరిష్కరించేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.
- తొలివిడతగా 292 మందికి భూ హక్కు పత్రాలు ఇచ్చాం. మిగిలిన వారికి త్వరలో భూ హక్కు పత్రాలు అందుతాయి. అది కూడా ఈకేవైసీ చేసి ఇస్తున్నాం. ఈ హక్కు పత్రాల్లో తప్పులుంటే..అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి..న్యాయపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం దిద్దే అవకాశం ఇచ్చిన వెంటనే సరుదిద్దుతాం.
- ఎన్నో ఏళ్ల తరువాత రీసర్వే ప్రక్రియను తీసుకొచ్చారు. ఈ సర్వేతో భూ యజమానులకు శ్వాశత పరిష్కారం లభిస్తుంది. సర్వ హక్కులు డిజిటల్‌మయం అవుతాయి. రైతులు సమస్యలను పరిష్కరించేందుకు సహకరించాలి. రీసర్వే ఉపయోగాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి.



చిత్తూరు మండలంలో రీసర్వే చేస్తున్న అధికారులు

రోడ్డుపైనే అడ్డదిడ్డంగా పార్కింగ్

- స్తంభించిపోతున్న ట్రాఫిక్
- పట్టించుకోని పోలీసులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



రహదారిపై ఆపేసిన ఆటోలు



రోడ్డుపైనే అడ్డదిడ్డంగా ఆపేసిన పాలవ్యాన్‌లు, ఆటోలు

యాదమరి: అసలే మండల కేంద్రంలోని బజారు వీధి... పైగా అంతర్ రాష్ట్ర రహదారి కావడంతో నిత్యం వేలాది సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రస్తుత ఆ రోడ్డుపైనే ఆటోలు, పాలవ్యానులు, ద్విచక్ర వాహనాలు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. మండల కేంద్రంలోని అంతర్ రాష్ట్ర రహదారి మెయిన్ బజారుగా మారిపోయింది. రహదారిపై వాహనాలకు దారి లేక ఇబ్బందులు పడుతుంటారు. వీటన్నింటి మధ్యలో యువత కొందరు బైక్ రేస్‌లతో హడలుగొడుతుంటారు. సైలెన్సర్లు తొలగించిన బైకులతో చెవులు చిల్లులు పడేలా వింత వింత శబ్దాలు చేస్తూ దూసుకుపోతుంటారు. వీళ్లు ఎవరినీ ఢీకొడతారో అన్న భయాందోళనతో రోడ్డుపై ఉన్నవారు అటూఇటూ పరుగులు తీయాల్సిందే. ఈ రహదారిపై మండల కేంద్రం దాటాలంటే వాహనదారులకు గంట సమయం పట్టిన సందర్భాలున్నాయి. ఇంత జరుగుతున్నా, ప్రయాణికులు, స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం మాత్రం శూన్యం. పోలీసులు ట్రాఫిక్ క్రమబద్దీకరణ గురించి అసలు పట్టించుకోరంటూ ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిత్తూరు-గుడియాత్తం అంతర్ రాష్ట్ర రహదారిలో యాదమరి మెయిన్ బజారు ఉంది. పోలీసు స్టేషన్ మెయిన్ బజారుకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉండడంతో ఇక్కడ పోలీసుల జాడ కూడా ఉండదు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రైవేటు కళాశాలలు రెండు, ప్రైవేటు పాఠశాలలు నాలుగు ఉన్నాయి. నిత్యం ఉదయం సాయంత్రం విద్యార్థులు మాత్రం రెండు వేల మందికి పైగా రాకపోకలు సాగిస్తుంటారు. అంతర్ రాష్ట్ర రహదారి కావడంతో వాహనాల రాక పోకలు అధికంగా ఉంటాయి. దీంతో యాదమరి మెయిన్ బజారులో వాహనాలు అడ్డదిడ్డంగా ఆపేయడంతో అందరూ ఇబ్బందులకు గురి అవుతున్నారు. దీంతో నిత్యం ట్రాఫిక్‌తో బజారుకు వచ్చే గ్రామీణ ప్రజలు, ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. అంతేకాకుండా పాలవ్యాన్‌లు నడిపే డ్రైవర్లకు లైసెన్స్‌లు లేకుండా వేగంగా నడుపుతుండడంతో పలు ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. ఇక ప్రయాణికులు తరలించే ఆటో డ్రైవర్లకు సైతం 80 శాతం మందికి డ్రైవింగ్ లైసెన్స్‌లు లేవు. కానీ వారు సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని వేగంగా వెళ్తుంటారు. కానీ పోలీసులు మాత్రం పట్టించుకోక పోవడంతో అదుపుతప్పి ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. దీనిపై జిల్లాస్థాయి పోలీసు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.